రామాయంపేట, అక్టోబరు 7 : వేర్వేరు ఘటనల్లో ఇరువురు వృద్ధులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన కాసుల నాగవ్వ (58) ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం కుటుంబీకులు పలుచోట్ల వెతకగా ఊరికి సమీపంలోని ఓ వ్యవసాయ పాడుబడ్డ బావిలో మృతదేహం లభ్యమైంది. అలాగే పట్టణానికి చెందిన పుట్టి పెద్దస్వామి(70) ఇంట్లో నుంచి వెళ్లిన రెండు రోజుల తర్వాత స్థానికంగా కొత్తచెరువులో శవం లభ్యమైంది. ఈ మేరకు పోలీసులు ఇరువురి మృతదేహాలను స్థానిక ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజ్ తెలిపారు.

● పురుగుల మందు తాగిన వ్యక్తి..

పాపన్నపేట, అక్టోబరు 7 : మద్యం మత్తులో పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం మండల పరిధిలోని కొడుపాకలో చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు గ్రామానికి చెందిన బునెల్లి విఠల్(66) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరచుగా కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఆదివారం మద్యం తాగి వచ్చి కుటుంబీకులతో గొడవ పడగా, మద్యం మానాలని హితవు పలికారు. దీంతో మనస్తాపానికి గురైన విఠల్ అర్ధరాత్రి పురుగుమందు తాగాడు. ఇది గమనించిన కుటుంబీకులు వెంటనే అతడిని మెదక్ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మరణించాడు. కొడుకు శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. ఆయనకు భార్య సాయమ్మ, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.



విఠల్(ఫైల్)

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మనోహరాబాద్, అక్టోబర్ 7: వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన మెడోజి సంతోష్(36) ఆదివారం స్నేహితుడి పుట్టినరోజు వేడుకకు దండుపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఆ గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిని దాటుతుండగా హైదారాబాద్ నుంచి తూప్రాన్ వెళ్తున్న గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంతోష్ (ఫైల్)

ద్విచక్ర వాహనం అదుపు తప్పి..

పాపన్నపేట, అక్టోబరు 7: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మల్లంపేట గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం కొత్త లింగాయిపల్లి గ్రామానికి చెందిన కోలుకురి సాయిలు (48) మండల కేంద్రమైన పాపన్నపేట నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మల్లంపేట గ్రామ శివారులోని సంగయ్య గుండ్ల వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

బ్రాహ్మణపల్లి రైల్వే గేటు మొరాయింపు

● ప్రయాణికుల అవస్థలు

తూప్రాన్, అక్టోబరు 7: రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద సోమవారం రాత్రి రైల్వే గేటు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తరచూ ఈ సమస్య ఉత్పన్నమవుతుండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. తూప్రాన్ పట్టణ పరిధిలో తూప్రాన్ - సంగారెడ్డి రహదారిపై బ్రాహ్మణపల్లి వద్ద రైల్వే లేవల్ క్రాసింగ్ గేటు ఏర్పాటు చేశారు. సోమవారం మధ్యాహ్నం సికింద్రాబాద్ నుంచి ముంబాయి వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ రాకతో బ్రాహ్మణపల్లి రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద గేటు వేశారు. ఆ సమయంలో గేటు లేచేంత వరకు వేచి ఉండకుండా టిప్పర్ డ్రైవర్ వెళ్లే ప్రయత్నం చేయగా గేటు తాకి వంగిపోయి మరమ్మతులకు గురైంది. దీంతో గేటు మరమ్మతులు చేయిస్తుండడం.. అది మొరాయించడం పరిపాటిగా మారడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాత్రి అరగంట పాటు గేటు మొరాయించినట్లు వాహనదారులు వివరించారు.

జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జగన్మోహన్‌రెడ్డి

జోగిపేట, అక్టోబరు 7: జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా మండలంలోని నేరడిగుంట గ్రామానికి చెందిని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మక్త జగన్మోహన్‌రెడ్డి నియామితులయ్యారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలోని తన నివాసంలో మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. ఈ పదవి కోసం... మండలంలోని అల్మాయిపేట మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, డాకూరుకు చెందిన మాజీ సర్పంచ్ జీఆర్ మధుసూదన్‌రెడ్డి, అక్సాన్‌పల్లి సొసైటీ చైర్మన్ జీఆర్ నరేందర్‌రెడ్డి, నేరడిగుంటకు చెందిన మాజీ ఎంపీటీసీ మిద్దెల రాజిరెడ్డి పోటీ పడ్డారు. ఆదివారం సదాశివపేట మండలంలోని ఓ ఫామ్‌హౌజ్‌లో మార్కెట్ కమిటీ పరిధిలోని కాంగ్రెస్ నాయకులతో మంత్రి సమావేశమయ్యారు. సోమవారం ఉదయం ప్రస్తుతం నియామకమైన జగన్మోహన్‌రెడ్డి మినహా, పోటీలో ఉన్న మిగిలిన నలుగురిని తన ఇంట్లోకి పిలిచిన దామోదర.. వారి ఎదుట జగన్మోహన్‌రెడ్డి పేరును ప్రకటించారు.



జగన్మోహన్ రెడ్డి

మాకూ న్యాయం చేయండి

● డీఎస్సీ-2008 ఎస్‌జీటీ అభ్యర్థులు



స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అభ్యర్థులు

సిద్దిపేట కల్చరల్, అక్టోబర్ 7 : డీఎస్సీ టీచర్ సెలక్షన్ రూల్ 15ను అమలు చేసి తమకూ న్యాయం చేయాలని ఉమ్మడి జిల్లాకు చెందిన డీఎస్సీ- 2008 ఎస్‌జీటీ అభ్యర్థులు కోరారు. ఈ మేరకు సోమవారం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ-2008 ఎస్‌జీటీ సెలక్షన్ లిస్టు తప్పులతడకగా ఉందని ఆరోపించారు. 2008లో డీఎస్సీ రాసి 70:30 రిజర్వేషన్ వల్ల ప్రభావితమైన అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో అవకాశం కల్పిస్తూ ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారన్నారు. అయితే ఈ ప్రక్రియలో కొన్ని లోపాలున్నాయని, డీఎస్సీ టీచర్ సెలక్షన్ రూల్ 15ను ఇంప్లిమెంట్ చేయడం లేదని ఆరోపించారు. ఒకే అభ్యర్థి స్కూలు అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టులకు సెలక్ట్ అయితే అతడిని స్కూలు అసిస్టెంట్ పోస్టుకు ఎంపిక చేసి, ఎస్‌జీటి పోస్టును తర్వాత మెరిట్ అభ్యర్థికి ఇవ్వాలన్నారు. 2008వ సంవత్సరం డిసెంబర్ 6న విడుదల చేసిన సర్వీస్ రూల్ కూడా ఇదే చెబుతుందని గుర్తుచేశారు. ఇలా రెండు సబ్జెక్టులకు సెలక్ట్ అయినవారు 40మంది ఉన్నారని, వాటికి తర్వాత మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేసి న్యాయం చేయాలని కోరారు. అంతేకాకుండా 292 పోస్టులకు 183 మంది మాత్రమే సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారని, ఇంకా 119 పోస్టులు ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందించడం లేదని వాపోయారు.

చిన్నారి పుట్టిన రోజున ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న జ్ఞానేశ్వర్

నారాయణఖేడ్, అక్టోబరు 7: నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేటకు చెందిన పసుల శ్రీనివాస్ ఇల్లు ఇటీవల భారీ వర్షాలకు కూలిపోగా నిరాశ్రయుడయ్యాడు. ఈ క్రమంలో మంగల్‌పేటకు చెందిన ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యుడు మేకల జ్ఞానేశ్వర్ తన కుమార్తె హైందవి ప్రియదర్శిని పుట్టిన రోజును పురస్కరించుకొని ఆర్థిక సాయంగా రూ.10 వేల విలువగల చెక్కును అందించారు.

త్రిబుల్ ఆర్ రెండోవిడుత అవార్డు విచారణ

● భూయాజమాన్య పత్రాల పరిశీలన

తూప్రాన్, అక్టోబరు 7: హైదరాబాద్ చుట్టూ నిర్మించ తలపెట్టిన రీజినల్ రింగ్ రోడ్డుకు భూసేకరణ చేసేందుకు రెండో విడుత అవార్డు విచారణ సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలో 143 హెక్టార్లకు గత మే నెలలో అవార్డు విచారణ జరిగిందని, రెండో విడుతగా 36.04 హెక్టార్ల భూసేకరణ చేరసేందుకు ఎన్‌హెచ్‌ఏఐ జూలై 18న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. 21 రోజుల్లో చట్టబద్ధత గడువులోగా ఏలాంటి అభ్యంతరాలు రానందున సెప్టెంబరు 25న ఈభూములకు డిక్లరేషన్ ప్రకటన జారీ చేసినట్లు తెలిపారు. ఈ భూములకు సంబంధించి రైతుల యాజమాన్య వివరాలను పరిశీలించేందుకు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నర్సంపల్లి, వెంకటాయపల్లి, గుండ్రెడ్డిపల్లి, కిష్టాపూర్ గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. రైతుల యాజమాన్య పత్రాలను పరిశీలన చేసినట్లు వివరించారు. రీజనల్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు భూసేకరణకు తాము సహకరిస్తామని, మార్కెట్ ధర చెల్లించాలని రైతులు కోరినట్లు ఆర్డీవో పేర్కొన్నారు.

రైతుల అభ్యంతరాలపై మళ్లీ సర్వే

నర్సాపూర్, అక్టోబరు 7: త్రిబుల్ ఆర్ రోడ్డు కోసం భూములు కోల్పోతున్న డివిజన్ పరిధిలోని 17 గ్రామాల రైతులతో అవార్డు విచారణ సోమవారంతో పూర్తయిందని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం శివ్వంపేట మండలం రత్నాపూర్, కొంతాన్‌పల్లి గ్రామాల రైతులతో అవార్డు విచారణ చేపట్టారు. ఆర్డీవో మాట్లాడుతూ విచారణలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలపై తిరిగి రైతుల సమక్షంలో సర్వే చేయించి పరిష్కరిస్తామని తెలిపారు.

ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్ పోటీలకు ఆహ్వానం

మెదక్ అర్బన్ / సిద్దిపేట క్రైం, అక్టోబరు7 : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా రాష్ట్ర పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్ పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ, మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా సోమవారం తెలిపారు. సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, మత్తుపదార్థాల సేవనం.. వాటి వల్ల అనర్థాలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలపై పోటీలుంటాయని తెలిపారు. గతేడాది అక్టోబరు నుంచి ఈ నెల వరకు తీసిన మూడు ఫొటోలను, అలాగే షార్ట్‌ఫిలిమ్(3 నిమిషాల నిడివి గల)తో పాటు పూర్తి విరాలను పెన్‌డ్రైవ్‌లో లేదా సీడీలో ఈ నెల 20 లోగా మెదక్, సిద్దిపేట జిల్లా పోలీసు కార్యాలయాల్లో అందజేయాలని పేర్కొన్నారు. ఈ పోటీలకు విద్యార్థులతోపాటు యువత, ఫొటోగ్రాఫర్లు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. మిగితా వివరాల కోసం మెదక్ జిల్లాకు సంబంధించి 8712659559, సిద్దిపేటకు జిల్లాకు సంబంధించి 9440379237 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పింఛన్లు ఇప్పిస్తామంటూ మోసం

హుస్నాబాద్, అక్టోబరు 7 : పింఛన్లు ఇప్పిస్తామంటూ హుస్నాబాద్ పట్టణంలో సంచరిస్తూ అమాయకుల నుంచి డబ్బులు కాజేస్తున్నది ఓ ముఠా. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని రెడ్డికాలనీలోకి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వ అధికారులమని, పింఛన్ ఇప్పిస్తామంటూ వృద్ధులు, మహిళలే లక్ష్యంగా మోసానికి పాల్పడుతున్నారని బాధితులు సోమవారం తెలిపారు. ఇంటింటికీ వెళ్లి 'మీకు పింఛను వస్తుందా..' అని అడుగుతారని, రావడం లేదంటే ఇప్పిస్తామని, వస్తుందంటే రూ. 4వేలు వచ్చేలా చేస్తామని నమ్మబలికి ఆధార్ కార్డు జిరాక్స్‌తోపాటు ఒక్కోక్కరి దగ్గర రూ.2 వేల నుంచి 5వేల వరకు డబ్బులు తీసుకుంటున్నారని వెల్లడించారు. రోడ్డుపై వెళ్లే వ్యక్తులను కూడా నమ్మించి ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఒక ఇంటి వద్దకు వచ్చి ఈ విధంగానే మోసం చేయబోగా గుర్తించిన సదరు వ్యక్తి వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా పరారయ్యారని తెలిపారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

రామచంద్రాపురం, అక్టోబరు 7 : గంజాయి విక్రేతను కొల్లూరు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ రవీందర్ కథనం ప్రకారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బహుబాన్ బాగ్ (32) మైహోమ్ నిర్మాణ సంస్థలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. అతనికి గంజాయి తాగడం అలవాటు. ఇటీవల తన రాష్ట్రానికి వెళ్లిన బహుబాన్ గంజాయిని తెచ్చుకున్నాడు. సోమవారం లేబర్ షెడ్ల వద్ద గంజాయి విక్రయిస్తుండగా కొల్లూరు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



నిందితుడు బహుబాన్‌బాగ్

గజ్వేల్‌లో చెక్కుల రచ్చ

- మీరివ్వాలంటే.. మీరివ్వాలంటున్న అధికార, ప్రతిపక్షాలు
- ఆరునెలలుగా లబ్ధిదారుల ఎదురుచూపులు
- సంక్షేమ పథకాలతోనా ఆటలు అంటూ ప్రజల అసంతృప్తి

గజ్వేల్, అక్టోబరు 7: గజ్వేల్ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ రచ్చరచ్చ అవుతుంది. మీరే పంపిణీ చేయాలంటే... మీరే పంపిణీ చేయాలంటూ.. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఏడునెలలుగా చెక్కులను పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గానికి ఆనుకొని ఉన్న సిద్దిపేట, దుబ్బాక, నర్సాపూర్, జనగామ నియోజకవర్గాల్లో చెక్కుల పంపిణీ పూర్తి చేసినా.. గజ్వేల్‌లో పంపిణీ పూర్తి చేయకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. నియోజకవర్గంలోని గజ్వేల్, తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో దాదాపు 850 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయి. విజయదశమి, బతుకమ్మ పండుగలు సమీపిస్తున్నా అటు అధికారపక్షం... ఇటు ప్రతిపక్షం ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం తప్ప ప్రజా సంక్షేమం పట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల కోసం లబ్ధిదారులు కొన్నినెలలుగా ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులకు పకడ్బందీ ఆదేశాలు ఉండడంతో వారు ఏమి చేయలేని పరిస్థితి కనిపిస్తోంది.

దసరాలోపు చెక్కులను పంపిణీ చేయాలి

- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబరు 7: దసరాలోపు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసును కాంగ్రెస్ నాయకులు గాడిపల్లి భాస్కర్, సర్దార్‌ఖాన్‌తో కలిసి ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలు అయినప్పటి నుంచి గజ్వేల్ శాసనసభ్యులు ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే ఎమ్మెల్యే కేసీఆర్ స్పందించి దసరాలోపు చెక్కులను పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటనరసింహారెడ్డి, వర్గల్ మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, సయ్యద్ మతిన్, కరుణాకర్‌రెడ్డి, వహీద్, సుభాష్ చంద్రబోస్, కో-ఆప్షన్ సభ్యుడు గంగిశెట్టి రాజు, అజహర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేడు చెక్కులు ఇవ్వండి.. లేకపోతే ఎల్లుండి ఆర్డీవో ఆఫీస్ ముట్టడిస్తాం

గజ్వేల్, అక్టోబరు 7: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం ఉదయం 10 గంటలకు అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో పంపిణీ చేయాలని, లేనిపక్షంలో బుధవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయాన్ని లబ్ధిదారులతో కలిసి ముట్టడిస్తామని బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ విషయంలో కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలోకి చొరబడిన వారిపై చట్ట పరమైన చర్యలను తీసుకోవాలని గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదును అందజేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, నాయకులు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెండె మధు, గజ్వేల్ మాజీ జడ్పీటీసీ పంగా మల్లేశం, మునిసిపల్ వైస్ చైర్మన్ జక్కియోద్దీన్, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

ప్రమాదవశాత్తు వ్యక్తికి తీవ్రగాయాలు

మిరుదొడ్డి, అక్టోబరు 7: మొక్కజొన్న కంకుల మిషన్‌లో చేయిపడి యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోట్ల చందు(26) మొక్కజొన్న మిషన్‌లో సంచులతో కంకులను వేస్తున్నాడు. ప్రమాదవశాత్తు అతడి చేయి మిషన్‌లో పడి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం భూంపల్లి ఆస్పత్రికి, అక్కడి నుంచి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

దొంగ అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ములుగు, అక్టోబరు 7: దొంగతనం చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించనట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ములుగు మండలం వంటిమామిడిలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. మామిడాల ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన పద్దుల కనకయ్య(31) అటువైపు వచ్చాడు. దీంతో అనుమానం వచ్చి విచారించగా.. కొద్దిరోజుల క్రితం వాగునూతి, బైలంపూర్‌లో దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతని నుంచి 2 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.లక్షా 17 వేలను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

దుబ్బాకలో పేకాట స్థావరంపై దాడి

- ఏడుగురి అరెస్టు, మొబైల్స్ స్వాధీనం

దుబ్బాక, అక్టోబరు 7: పేకాట స్థావరంపై దుబ్బాక పోలీసులు, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి సంయుక్తంగా దాడిచేశారు. ఈ ఘటనలో ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మండలం పెద్దచీకోడు శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో దాడిచేశామన్నారు. వారి నుంచి రూ.5,470 నగదు, ఆరు బైకులు, ఏడు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 24 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, అక్టోబరు 7: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, తన సిబ్బందితో కొన్నిరోజుల క్రితం నుంచి సిద్దిపేటలో నర్సాపూర్, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాల్లో రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 24 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా.. విచారణ చేసి 24 మందికి రూ.44,500 జరిమానా విధించారు.

'పరిశ్రమలను స్వాగతిద్దాం'

మర్కుక్, అక్టోబరు 7: టీఎస్ఐఐసీ ఆదేశాల ప్రకారమే నూతన కంపెనీ నిర్మాణం చేపడుతున్నామని, ప్రజలు విషయం తెలుసుకుని సహకరించాలని జోడస్ కంపెనీ జనరల్ మేనేజర్, సీనియర్ ఇంజనీరింగ్ అండ్ ప్రాజెక్టు ఆఫీసర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కర్కపట్ల గ్రామంలో జోడస్ కంపెనీ నిర్మాణం టీఎస్ఐఐసీ వారి ఆదేశాల మేరకే నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థులు నిర్మాణ పనులను అడ్డుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. టీఎస్ఐఐసీ వారు మత్తడి మైసమ్మ ఆలయం కోసం 550 గజాల భూమిని కేటాయించారని, దానిని వదిలేసి కంపెనీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. అందుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు తమ దగ్గర ఉన్నాయని.. గ్రామస్థులు కంపెనీ యాజమాన్యానికి సహకరించాలని కోరారు.

మెరుగైన వైద్యమందించాలి: బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, అక్టోబరు 7: మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన సత్తయ్య అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బాధితుడిని ఆస్పత్రిలో పరామర్శించారు. సత్తయ్యకు మెరుగైన వైద్యమందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్, ఆస్పత్రి ఆర్ఎం రాజేశ్వర్ ఉన్నారు.

కురుమలు అన్నిరంగాల్లో ముందుండాలి

- ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు


విద్యార్థులను సన్మానిస్తున్న కురుమ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 7: కురుమలు అన్నిరంగాల్లో ముందుండాలని కురుమ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు అన్నారు. సోమవారం చదువుల్లో ప్రతిభ కనబరిచిన, నూతన ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 50 మందికి కురుమ విద్యార్థులను సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సన్మానించి, ప్రతిభా పురస్కారాలు అందజేసి మాట్లాడారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది వేసవిలో స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిందం రాజమల్లయ్య, ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి, రమేష్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి: సీఐ


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ శ్రీను

చేర్యాల, అక్టోబరు 7: క్రీడాపోటీలు గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారుల్లో నెలకొన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు స్నేహభావాన్ని పెంపొందింపజేస్తాయని చేర్యాల సీఐ ఎల్.శ్రీను అన్నారు. చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలో కొమ్మూరి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు ఆరుట్ల వినీత్, తాడెం రమేష్, దొంగల లింగారెడ్డి, నీరటి విజయ్, గదరాజు నరేశ్, నౌషాద్, గదరాజు సురేందర్ పాల్గొన్నారు.

వరిలో ఆకు చుట్టుపురుగు నివారణ చర్యలు పాటించాలి

- మండల వ్యవసాయ అధికారి టి.నాగేందర్‌రెడ్డి

మర్కుక్, అక్టోబరు 7: వరిలో ఆకు చుట్టు పురుగు నివారణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి డాక్టర్ టి.నాగేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మర్కుక్ మండల కేంద్రం, నరసన్నపేట గ్రామాల్లో ఆకు చుట్టు పురుగు ఆశించిన వరి పొలాలను సందర్శించి మాట్లాడారు. ఈ పురుగు నివారణకు పొటాకు దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి. 2 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 20ఎస్.సి.0.4ఎంఎల్ లేదా ఫ్లూబెండిమైడ్ 20 డబ్ల్యూ.డిజి 0.25 గ్రా లేదా ఫ్లూబెండమైడ్ 48 ఎస్‌సి 0.1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

'నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలి'

కొండపాక, అక్టోబరు 7: నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాలస్వామి డిమాండ్ చేశారు. కొండపాక మండలం దుద్దెడలో సోమవారం జరిగిన మహాసభలో మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్యులకు భారంగా తయారైందన్నారు. నాగరాజు, పి.శ్రీనివాస్, కిష్టయ్య పాల్గొన్నారు.

సమాచారం

హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం: బీఆర్ఎస్

ములుగు: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మైనార్టీ యూత్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జుబేర్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వం మహిళలకు చీరలు, రైతులకు రైతుబంధు అందించకపోవడం విచారకరమన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేట రూరల్: నేడు సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు 33 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వ్యవసాయ, ఇండస్ట్రీయల్ ఫీడర్ల మరమ్మతు కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని సిద్దిపేట రూరల్ డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్‌వోసీ అందజేత

దుబ్బాక: దుబ్బాక మండలం ఆకారం గ్రామానికి చెందిన ప్రతమేష్ సాయి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతనాన్నడు. దుబ్బాక సీఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి రూ.లక్ష ఎల్‌వోసీ పత్రాన్ని నాయకులకు అందజేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

జగదేవ్‌పూర్/మర్కుక్, అక్టోబరు 7: ఈనెల 9న గజ్వేల్ మండలం అక్కారంలో నిర్వహించే బహుజన బతుకమ్మ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలువురు ప్రజాసంఘాల నాయకులు కోరారు. జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలో సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. మర్కుక్ మండలంలో కూడా బహుజన బతుకమ్మకు సంబంధించిన పోస్టర్‌ను టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రామచంద్రం ఆవిష్కరించారు.

'వీధిలైట్లు ఏర్పాటు చేయాలి'

చేర్యాల: కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు బద్దిపడిగ కృష్ణారెడ్డి తదితరులు సోమవారం గ్రామపంచాయతీ కార్యదర్శి రాజమణికి వినతి పత్రం అందజేశారు.

రైతాంగ శ్రేయస్సు బీజేపీతోనే సాధ్యం

- పార్టీ పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తరుణ్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబరు 7: రైతాంగ శ్రేయస్సు బీజేపీతోనే సాధ్యమని బీజేపీ పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తరుణ్‌రెడ్డి అన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి నిధులను విడుదల చేసిన సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, సమీకృత మార్కెట్‌లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని కోట్లాది మంది రైతులకు ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం నవరాత్రి కానుక అందించిందన్నారు. రైతన్నలకు వ్యవసాయ పెట్టుబడి సాయం అందించే పీఎం కిసాన్ సమ్మాన్ 18వ విడత నిధులు విడుదల చేశారని, 9.4 కోట్ల మంది రైతులకు రూ.20 వేల కోట్లను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో బదిలీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడిక్యాల రాములు, బీజేవైఎం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నీలం దినేశ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండమ్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చేపూరి విజయ్, నాయకులు కొలుపుల నరేందర్, ఐల మహేందర్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి ఏగొండ, బీజేపీ గజ్వేల్ పట్టణ ఉపాధ్యక్షుడు నాయిని సందీప్ తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

సద్దుల బతుకమ్మకు పకడ్బందీ ఏర్పాట్లు

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య


హుస్నాబాద్: బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రజిత

గజ్వేల్, అక్టోబరు 7: సద్దుల బతుకమ్మకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య అన్నారు. గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు కట్టపై బతుకమ్మ పండుగ ఏర్పాట్లను సోమవారం పరిశీలించి మాట్లాడారు. బతుకమ్మ సందర్భంగా లైటింగ్, బుష్‌ేష్ క్లీనింగ్, పారిశుధ్యం పనులను పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గజ్వేల్ పట్టణంలోని డంపింగ్ యార్డులోని డీఆర్‌సీసీ సెంటర్‌లో పొడి చెత్త వేరుచేసే విధానాన్ని, కంపోస్టు షెడ్లను పరిశీలించారు.

●హుస్నాబాద్: ఈ నెల 10న హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు, ఆరెపల్లి చెరువు వద్ద జరిగే సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత సోమవారం పరిశీలించారు. బతుకమ్మకు వచ్చే మహిళలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ పున్న లావణ్య, మ్యాదరబోయిన వేణు, మ్యాదరబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

●ధూళిమిట్ట: సద్దుల బతుకమ్మ సందర్భంగా మండలంలోని పలు చెరువుల వద్ద ఏర్పాట్లను తహసీల్దార్ మధుసూదన్ సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

గజ్వేల్, అక్టోబరు 7: గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో ప్రత్యేకంగా బతుకమ్మను పేర్చి, బతుకమ్మ పాటలతో హోరెత్తించారు. అనంతరం కోలాటాలు ఆడి, పాడారు.


గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రిలో బతుకమ్మ ఆడుతున్న వైద్యులు, సిబ్బంది

శ్రద్ధగా చదివి మంచిపేరు తేవాలి

- మాజీమంత్రి హరీశ్‌రావు
- ఐఐటీ, నీట్‌లో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 7: కష్టపడి చదివి తల్లిదండ్రులకు, సిద్దిపేటకు మంచిపేరు తేవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. కేఆర్ ఇంజనీరింగ్ అండ్ గైడెన్స్ ద్వారా శిక్షణ పొంది ఐఐటీ, నీట్ (ఎన్ఐటీ)లో సీట్లు సాధించిన సుమారు 200 మంది విద్యార్థులను సోమవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో కెరీర్ గైడెన్స్ సెంటర్‌ను ప్రారంభించినప్పుడు కొంత సంశయం ఉండేదని తొందరగానే మంచి ఫలితాలు రావటం సంతోషంగా ఉందన్నారు. నారాయణ, శ్రీచైతన్య లాంటి సంస్థల్లో లక్షల రూపాయలు వెచ్చించి పొందే శిక్షణ సిద్దిపేటలో దొరుకుతుందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఒకవైపు తన ఉద్యోగం చేసుకుంటూనే విద్యార్థులకు ఉచితంగా గైడెన్స్ అందించటం అభినందనీయమని కొనియాడారు. రాములును ఆదర్శంగా తీసుకుని పేద విద్యార్థులకు సహాయం చేయాలని హరీశ్‌రావు సూచించారు.

స్వయం సేవకుల రూట్ మార్చ్


హుస్నాబాద్ పట్టణంలో రూట్ మార్చ్ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

హుస్నాబాద్, అక్టోబరు 7: ఆర్ఎస్ఎస్ ప్రారంభమై వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని పురవీధుల గుండా స్వయం సేవకులు పద సంచలన (రూట్ మార్చ్) నిర్వహించారు. దేశంలోని అన్ని ఖండా కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖండ కార్యవాహ సత్యనారాయణ, చిట్టి గోపాల్‌రెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి, కొత్తపల్లి దేవేందర్, దొడ్డి శ్రీనివాస్, వీరారెడ్డి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కర్ణకంటి నరేష్ తదితరులున్నారు.

'ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలి'

గజ్వేల్, అక్టోబరు 7: ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గజ్వేల్ ఎల్ఐసీ శాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌కు ఎల్ఐసీ ఏజెంట్లు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లియాఫీ సికింద్రాబాద్ డివిజన్ నాయకుడు సురేందర్‌కుమార్, లియాఫీ గజ్వేల్ అధ్యక్షుడు మెతే వీరారెడ్డి మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం దిశగా మేనేజ్‌మెంట్ చొరవ చూపాలన్నారు. వారితో లియాఫీ కార్యదర్శి సాంబయ్య, ఏజెంట్లు మహేందర్, శ్రీనివాస్, నరేందర్, బాల్‌లింగం, లక్ష్మణ్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, తూంశేఖర్, రాఘవరెడ్డి ఉన్నారు.







తంగళ్లపల్లిలో గుడి స్థలం ఆక్రమణ

కోహెడ, అక్టోబరు 7: మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో సార్లమ్మ గుడి స్థలాన్ని ఆక్రమించిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బండమీది రాజమౌళిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈనెల 2న గ్రామ చావడిలో జరిగిన గ్రామసభలో ఆక్రమించిన దానిని కూల్చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామపంచాయితీ ఆబాది స్థలంలో 2 పిల్లర్లు నిర్మాణం చేశారని, ఐదు ఫీట్ల వరకు ఆక్రమించుకున్న స్థలాన్ని కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో, ఇంటి యజమాని సమక్షంలో ప్రహరీని తొలగించారు. గుడి ఆక్రమణ స్థలం కూల్చివేతకు గ్రామానికి చెందిన పాము శ్రీకాంత్, జోగు చందు, మాటం శ్రీనివాస్, కొత్తూరు రమేష్ కారణమంటూ పోలీస్‌స్టేషన్‌లో రాజమౌళి ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణకు రాగానే సార్లమ్మ గుడి స్థలం ఆక్రమణ జరిగిందని గ్రామస్థులు ముక్తకంఠంతో చెప్పారు. గుడి స్థలం ఆక్రమణ విషయమై గ్రామసభలో మాట్లాడిన వారిపై కేసులు చేయడం ఎంత వరకు సమంజసమని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సంపత్ అన్నారు. బండమీది రాజమౌళిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.


కూల్చివేసిన గుడి స్థలం


కాళీకామాత అవతారంలో మహంకాళీ అమ్మవారు


సిద్దిపేటలోని దుర్గామాత మండపాలను దర్శించుకున్న మాజీమంత్రి హరీశ్‌రావు


కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

దుర్గమ్మకు విశేష పూజలు

సిద్దిపేట జిల్లాలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు. మహిళలు అమ్మవారికి నైవేద్యాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కాగా సోమవారం పలు మండపాలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ప్రజాప్రతినిధులు దర్శించుకుని పూజలు చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్


చేర్యాల పట్టణంలోని మైసమ్మవీధిలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు